క్లుప్తంగా

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు



చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నచింతకుంట మండలం కురుమూర్తిలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అనారోగ్యంతో బాధ పడుతున్న పార్టీ సీనియర్ కార్యకర్త కృష్ణయ్యను పరామర్శించారు. అనంతరం కురుమూర్తి, ముచ్చింతలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో లారీ అసోసియేషన్ నాయకులు



జడ్చర్ల: జడ్చర్ల లారీ అసోసియేషన్‌కు చెందిన పలువురు నాయకులు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరినవారిలో మున్వర్ పాష, ఖదీర్, సయ్యద్ వాజీద్, జాంగీర్, అన్వర్, ఫయాజ్, మోసిన్, నజీర్, బషీర్, రెహమాన్ తదితరులు ఉన్నారు.

నెలరోజుల్లో షీటీంకు 25 ఫిర్యాదులు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లావ్యాప్తంగా ఆగస్టు నెలలో షీ టీంకు మొత్తం 25 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ డి.జానకి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే షీటీం బృందం 13 మంది యువకులతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారని, మరో 11 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారని, మూడు కేసులు నమోదు, 25 అవగాహన సదస్సులు, 70 హాట్‌స్పాట్ విజిట్స్ చేసినట్లు వెల్లడించారు. ఎప్పటికప్పుడు పోకిరీలను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు సైతం ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, డ్రగ్స్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వేధింపులకు గురైన అమ్మాయిలు ఎవరైనా ఉంటే సెల్ నం.8712659365 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆకట్టుకున్న 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాతపాలమూరులో శారద లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాంజనేయ యుద్ధం పూర్తి నాటకం ఆకట్టుకుంది. అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మైసమ్మ గుడి వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి ఈ భక్తిరస పౌరాణిక పద్యనాటకం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు దర్శకత్వంలో నిర్వాహించిన ఈ పద్యనాటకంలో శ్రీకృష్ణుడిగా రాంచంద్రయ్య, ఆంజనేయుడిగా రాములు, నారదుడిగా వెంకటేశ్వర్‌రావు, బలరాముడుగా కాశన్న, గరుత్మంతుడుగా కొండాచారి, ప్రతిహారిగా బిక్షపతి, కుచేలుడుగా చెన్నయ్యతోపాటు తదితరులు ఆయా పాత్రల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. లేడీ యాక్టర్లు సత్యభామగా రాధిక, రుక్మిణిగా రాజేశ్వరీ వ్యవహరించారు. ఈ పద్యనాటకానికి రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత వరకవుల మాధవరాజు సంగీతం సమకూర్చారు. నాటకం ప్రదర్శించిన నటీనటులను గణేశ్ ఉత్సవ నిర్వాహకులు జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నవాబుపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు అవసరమైన వాటిని మండల అధికారులతో మాట్లాడి సమకూర్చుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి వన మహోత్సవం బిల్లులు వెంటనే అందేలా మస్టర్లు అందించి బిల్లులు చేయాలని సూచించారు. ఏపీఓ జ్యోతి పాల్గొన్నారు.

అర్ధాంతరంగా వదిలేశారు!

- అసంపూర్తి పనులతో అవస్థలు
- పూర్తికాని రెడ్డిపల్లి-బల్సూర్‌గొండ రోడ్డు
- నిర్మాణంలో నాణ్యతాలోపం
- ఊసేలేని సీసీరోడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



సీసీ రోడ్డు వేయకుండా కంకర వేసి వదిలేసిన రోడ్డు

గండేడ్: గడువు ముగిసి రెండున్నరేళ్లు పూర్తయినా రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా వదిలేశారు. నిర్మాణంలో నాణ్యతాలోపం వల్ల వేసిన రోడ్డు సైతం దెబ్బతింటోంది. గ్రామాల్లో నిర్మించాల్సిన సీసీ రోడ్డు ఊసే లేకపోవడంతో గ్రామీణ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. కాంట్రాక్టరు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గండేడ్ మండలంలోని భూత్పూర్-చించోళి జాతీయ రహదారి నుంచి రెడ్డిపల్లి గేటు మీదుగా బల్సూర్‌గొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు మెటలింగ్ కమ్ బీటీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పీఎం గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద రూ.3.71కోట్లు 2021లో మంజూరయ్యాయి. ఈ నిధులతో 5.8 కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలి. ఇందులో 4.7 కిలోమీటర్లు బీటీ రోడ్డు, 1.10 కిలోమీటర్లు సీసీ నిర్మించాల్సి ఉంది. అవసరమైన చోట 12 కల్వర్టులు 25 మీటర్లు రిటెయినింగ్ వాల్‌ను కూడా నిర్మించాలి. వయా రెడ్డిపల్లి మన్సూర్‌పల్లి, కొండాపూర్‌ను కలుపుతూ బల్సూర్‌గొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. కేంద్ర గ్రామీణ శాఖ ఈప్రాజెక్టు నిర్వహణ కొనసాగిస్తారు. 2021లో నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎస్ఆర్ క్రెస్టు ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ టెండరు దక్కించుకుంది. 2021 జూన్ 22న ప్రారంభించి 2022 డిసెంబర్ 21 వరకు పూర్తి చేయాల్సి ఉంది. వీటన్నింటిని కాంట్రాక్టర్ తుంగలో తొక్కాడు. పనులు ప్రారంభించడంలోనే జాప్యం చేశాడు.

నిలిచిన సీసీ రోడ్డు నిర్మాణం

రెడ్డిపల్లి గేటు నుంచి బల్సూర్‌గొండ వరకు 4.7 కి.మీ. బీటీ నిర్మాణం పూర్తయ్యింది. రెడ్డిపల్లి, మన్సూర్‌పల్లి, కొండాపూర్ వద్ద నిర్మించాల్సిన 1.10 కి.మీ. మేర సీసీరోడ్డు నిర్మాణం మాత్రం నిలిచింది. కంకర తేలి అధ్వాన్నంగా, గుంతలు పడి నీరు నిలుస్తోంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ దారి నుంచి పగిడ్యాల్, కొత్లాబాద్, బల్సూర్‌గొండవారు గండేడ్‌కు చేరుకోవాలంటే చాలా సులభం. దాదాపు 15 కి.మీ.పైగా దూరం తగుతుంది. బీటీరోడ్డు నిర్మాణంలో నాణ్యతాలోపం ఉంది. రెడ్డిపల్లి సమీపంలో బీటీ పాడయితే దాన్ని తొలగించారు. దాని స్థానంలో కొత్త రోడ్డు వేయలేదు. అయినా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు.

గడువు ముగిసినా పూర్తికాని నిర్మాణం

టెండరు సమయంలో రోడ్డు నిర్మాణం ఎప్పుడు ప్రారంభించాలి, ఎప్పుడు పూర్తి చేయాలి, ఎప్పటి వరకు రోడ్డు మెయింటెనెన్స్ నిర్వహించాలి, ఇలా అన్ని పనులకు సంబంధించి నియమాలు పొందుపరుస్తారు. వాటికి ఒప్పుకునే టెండర్లో పాల్గొంటారు. కాని ఇక్కడ కాంట్రాక్టర్ నిబంధనలకు తుంగలో తొక్కాడు. గడువు ముగిసినా బీటీ నిర్మాణం పూర్తి చేయడం లేదు. గడువు ముగిసి రెండున్నరేళ్లు గడిచినా, పనుల్లో పురోగతి లేదు. 21 డిసెంబరు 2022 వరకు నిర్మాణం పూర్తి చేయాలి. 22 డిసెంబరు 2022 నుంచి 21 డిసెంబరు 2027 వరకు ఐదేళ్ల పాటు మెయింటెనెన్స్ చేయాల్సి ఉంది. ఈ మెయింటెనెన్స్‌కు గాను రూ.24.38 లక్షల నిధులు కూడా కేటాయించారు. సకాలంలో పూర్తి చేయడంలో కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నాం..



రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నాం. కంకర తేలడంతో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. రాత్రి వేళల్లో బైక్‌పై వెళ్లలేకపోతున్నాం. రెడ్డిపల్లి గేటు నుంచి ఊరి చివర వరకు కంకర రోడ్డు ఉంది. పగిడ్యాల్, బల్సూర్‌గొండ, కొండాపూర్‌కు వెళ్లాలంటే ఇదే అనువైన దారి. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుంది.

– కృష్ణారెడ్డి, రెడ్డిపల్లి

ఈ నెలాఖరు వరకు పూర్తి చేయిస్తాం..

ఇప్పటికే బీటీ నిర్మాణం పూర్తి కావాల్సింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నాడు. పలుమార్లు నోటీసులు కూడా ఇచ్చాం. ఇటీవల రెడ్డిపల్లి సమీపంలో పాడైన బీటీని తొలగించాడు, తిరిగి కొత్తగా బీటీ వేయలేదు. మన్సూర్‌పల్లి సమీపంలో బీటీ పాడైంది. దానిని కూడా తొలగించి కొత్త బీటీ వేయిస్తాం. ఈ నెలాఖరులోగా ఆయా గ్రామాల వద్ద పూర్తి చేయాల్సిన సీసీ రోడ్డును కూడా పూర్తి చేయిస్తాం.

– సురేశ్, పంచాయత్‌రాజ్ ఏఈ, హన్వాడ

వెళ్లిరావయ్యా.. వినాయక



జడ్చర్లలోని 3వ వార్డులో నిమజ్జనానికి సిద్ధమైన వినాయకుడు ఎదుట ఉత్సవ కమిటీ సభ్యులు



మున్సిపాలిటీలోని అయ్యప్పకాలనీలో వినాయక ఊరేగింపులో మహిళల కోలాటం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని గుండప్పకాంపౌండ్‌లోని గణేశ్ మందిరంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని సోమవారం నిమజ్జనం చేశారు. 85ఏళ్లుగా గణేశ్ మందిరంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గణేశ్ మందిరంలో సోమవారం రాత్రి ప్రత్యేక పూజల అనంతరం వాహనంలో వినాయక ప్రతిమ ను ఉంచి ఊరేగించారు. ఊరేగింపులో వీరశైవ లింగాయత్‌ల సంప్రదాయం ప్రకారం ఖడ్గాలు చదువుతూ ముందుకు సాగారు. వీరితోపాటు బాబిస్ట్రీట్ మార్వాడి సంఘం, వెంకటేశ్వరకాలనీ, లక్ష్మీవెంకటేశ్వర ఎంప్లాయిస్ కాలనీ, అయోధ్యనగర్, గాంధీనగర్ ట్రస్టుకాలనీలతోపాటు పలు వినాయక ఉత్సవ కమిటీలు ప్రతిష్ఠించిన ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనం కోసం నాగసాల చెరువు వద్ద మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం 500వరకు విగ్రహాలు ప్రతిష్ఠించగా 5వరోజు వరకు 100 విగ్రహాలు తరలించారు. మండపం వద్ద అన్నదానాలు, లడ్డూవేలాలతో కోలాహలం నెలకొంది.



పీయూలో పూజలు చేస్తున్న వీసీ శ్రీనివాస్



నాగసాల చెరువు వద్ద గంగమ్మ ఒడిలోకి చేరుకుంటున్న వినాయకుడు

పీయూలో ఘనంగా నిమజ్జనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని సోమవారం నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు పీయూ వీసీ శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, కంట్రోలర్ ప్రవీణ, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, అనురాధ, చంద్రకిరణ్ పాల్గొన్నారు.

పార్వతి తనయా.. పాహిమాం



జిల్లా కేంద్రంలోని ఎనుగొండ శ్రీరామకృష్ణ కాలనీలో పూజలు చేస్తున్న కాలనీ యువజన సంఘం సభ్యులు



దేవరకద్ర వాసవీ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చదువుకుంటేనే భవిష్యత్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: చదువుకుంటేనే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ లభిస్తుందని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ అన్నారు. శతశాతం కార్యక్రమానికి ఎంపికైన 28 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 130 మంది ఉపాధ్యాయులకు బీకే రెడ్డి కాలనీలోని మహబూబ్‌నగర్ ఫస్ట్– నవరత్నాలు శిక్షణ కేంద్రంలో మొదటిరోజు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చురుగ్గా ఉన్న కొందరు విద్యార్థులను లిటిల్ టీచర్స్‌గా ఎంపిక చేశామన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో విద్యా వలంటీర్‌ను నియమించామన్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించి చురుకైన విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దుతారన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు


అడ్డాకుల: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయంతి, మూసాపేట మండలాధ్యక్షురాలు రాధ డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించు కుని సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సప్ప ఉన్నారు.

మిడ్జిల్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రావణ్, నర్సింహులు, సుదర్శన్, సందీప్, నరేశ్, శైలజ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీల తో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కృష్ణ, నాయకులు మన్యం, శ్రీనివాస్, నరేశ్, శివకుమార్, శ్రీనివాస్, ఆర్య, శంకర్‌బాబు, నజీర్, గౌసియాబేగం, భరత్, శారద, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు అక్తర్ హుస్సేన్ డీటీఎఫ్ మండలాధ్యక్షుడు నర్సప్ప పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ సోమవారం మనికొండలో జెడ్పీ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్, సుధాకర్‌రెడ్డి, బుచ్చారెడ్డి తదితరులు హాజరయ్యారు.



మూసాపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మించాలి



కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేస్తున్న మల్లెపోగు శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ఏనుగొండ 5వ వార్డులో సర్వేనెంబర్ 55లో దళితుల కోసం కమ్యూనిటీ హాల్, షాదీఖానా నిర్మించాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిని ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏనుగొండ 5వ వార్డులో మాదిగల జనాభా 1500–2000 ఉంటుందని, శుభకార్యాలు జరుపుకోవడానికి అనువైన స్థలం లేదని, సర్వేనెంబర్ 55లో 900 గజాల స్థలంతోపాటు రూ.50లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి నగర పాలక సంస్థ కమిషనర్‌ను ఎస్టిమేషన్ వేసి లెటర్ పెట్టాలని ఆదేశించారని పేర్కొన్నారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు



భక్తులకు అన్నం వడ్డిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో సోమవారం గణేషుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వర్షాలు సకాలంలో పడి పంటలు బాగా పండాలన్నారు. వర్షాలు పడితేనే మనిషి మనుగడ ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలని, సంతోషంగా పడుగలను జరుపుకోవాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల కోసం అన్నదానం ఏర్పాటు చేడయం సంతోషకరమని నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, నరేందర్, రామకృష్ణ, తిరుపతమ్మ, చంద్రయ్య, మహేశ్, భాస్కర్, విజయ, సునీత పాల్గొన్నారు.

ఉత్సవాలను కలిసిమెలిసి జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల: గణేష్ ఉత్సవాలతోపాటు ఇతర పండుగలు సమైక్యభావనతో కలిసిమెలసి శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన శాంతి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలో కొందరు ఐదు, మరికొందరు 9రోజులకు నిమజ్జనం చేస్తున్నారన్నారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కోరారు. డీజే సౌండ్స్‌కు అనుమతులు లేవని ఇతర మతాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించొద్దన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దని తెలిపారు. సమావేశంలో సీఐ కమలాకర్, వార్డు కౌన్సిలర్లు చైతన్యచౌహాన్, రాజు, ఉమాగౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేశం, జగ్‌పాల్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించాలి



అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్దికి సంబంధించిన ఓటరు జాబితాలో గ్రామానికి సంబంధం లేని దొంగఓట్లను తొలగించాలని బీఆర్ఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ ఆధ్వర్యంలో నాయకులు అధికారులను కలిసి ఓటరు జాబితాలో ఉన్న తాటికొండ, వనపర్తి, మహబూబ్‌నగర్, మూసాపేటకు చెందినవారి 28ఓట్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, దాసర్‌పల్లి రవివర్ధన్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

'మా ప్లాట్లను మాకు ఇప్పించండి'




జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జడ్చర్ల మండలంలోని బండమీదిపల్లి శివారులోని సరే నెంబర్ 357లో కొనుగోలు చేసిన మా ప్లాట్లను కొంత మంది ఆక్రమించుకున్నారని.. ఆ ప్లాట్లను మాకు ఇప్పించండని బాధితులు సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ.. 2005లో ఇంటిస్థలం కోసం కొన్న ప్లాట్లను కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. ఇది అన్యాయమని ప్రశ్నించిన మాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ సంబరాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో పాస్ కావడంపై సోమవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. స్థానిక న్యూటౌన్‌లోని మల్లికార్జున్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, అజ్మత్‌అలీ, అవేజ్, షబ్బీర్ అహ్మద్, అంజనేయులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం వితరణ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో రాజేంద్రనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద సోమవారం పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. దాదాపు 1500 మందికి అన్నప్రసాద వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధా అమర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమరేందర్‌రాజు, సభ్యులు శ్రీనివాసరాజు, సతీశ్‌కుమార్, రాజశేఖర్, జ్ఞానేశ్వర్, సుభాశ్, కిశోర్, రాకేశ్ పాల్గొన్నారు.

నిమజ్జనం 5వ తేదీన జరుపుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈనెల 5వ తేదీన గణేశ్ నిమజ్జనం జరుపుకోవాలని గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గణేశ్ భవన్‌లో నిర్వహించిన ఉత్సవ సమితి సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 4వ తేదీన లడ్డూ వేలం పాటలు నిర్వహించుకోవాలని, అదేవిధంగా 5న నిమజ్జనం చేయాలని కోరారు. నిమజ్జనం కోసం భూత్పూర్ రోడ్డులోని పాల్కొండ బైపాస్ వద్ద వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదుఫీట్ల కంటే పెద్ద విగ్రహాలను బీచుపల్లిలో నిమజ్జనం చేయాలని, చిన్నవిగ్రహాలను మయూరీ పార్క్ వద్ద చెరువు, చిన్నదర్పల్లి చెరువు, శ్రీనివాసకాలనీ చెరువుల వద్ద కూడా చేయాలన్నారు. సమావేశంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, నాగరాజు, విఘ్నేశ్, హన్మంతు, జనార్దన్, భరత్, శ్రీశైలం, సుదర్శన్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మండపం నిర్మాణానికి విరాళం

భూత్పూర్: మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడి వద్ద హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమిస్తాపూర్‌లోని 5వ వార్డులో చేనేత కాలనీలో చేనేత యువజన సంఘం ఏర్పాటు చేసిన గణనాథుడికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండపం నిర్మాణానికి రూ.30వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పద్మనరేందర్, ఆనంద్, నాయకులు నర్సింహులు, ఎల్లప్ప, సాయి పాల్గొన్నారు.

సంతకు వేరే స్థలం కేటాయించాలి

రాజాపూర్: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతకు వేరే స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వారాంతపు సంతను ఇటు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై, అటు రాజాపూర్ నుంచి కుచ్చర్‌కల్ తదితర గ్రామాలకు వెళ్లేరోడ్డుపై నిర్వహిస్తుండడంతో ఇతర గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డుపై కూరగాయల సంత నిర్వహిస్తుండడంతో వాటిపై దుమ్ము, ధూళి పడుతుందని కొనుగోలు దారులు ఆరోపిస్తున్నారు. ప్రతి వారం తైబజార్ ద్వారా కూరగాయల వ్యాపారుల నుంచి కాంట్రాక్టర్ రుసుం వసూలు చేస్తూ కనీస వసతులు కల్పించడంలేదని విక్రయదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంత ఏర్పాటుకు సపరేటు స్థలం కేటాయించి ఇబ్బందులు తొలగించాలని కూరగాయల విక్రయదారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

అన్నదానం మహాదానం

రాజాపూర్: అన్నదానం చేయడం అదృష్టంగా భావించాలని రాజాపూర్ భజరంగ్‌దళ్ అధ్యక్షుడు సతీశ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో భజరంగ్‌దళ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద గ్రామస్తుడు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సతీశ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

జడ్చర్ల టౌన్: పుట్టపర్తి సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో 18మంది మహిళలకు సామూహిక సీమంతం జరిపించారు. వారికి పౌష్టికాహారం అందించి ఆరోగ్య సలహాలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

పాలమూరు/నవాబుపేట/హన్వాడ: జిల్లాకేంద్రంలోని పద్మావతికాలనీ, నవాబుపేట మండలం కాకర్లపహాడ్, కొండాపూర్, హన్వాడ మండలంలోని పెద్దదర్పల్లిలో ఎంపీ నిధుల ద్వారా కేటాయించిన హైమాస్ట్ లైట్లను ఎంపీ డీకే అరుణ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గణేశ్‌చారి, నరేందర్, అర్జున్, రాఘవేందర్‌చారి, నర్సింహులు, వెంకటేశ్, బాలకిష్టయ్య, సురేశ్, బక్కా శామలమ్మ, మాజీ సర్పంచ్ వెంకన్న, శ్రీనుసాగర్, వినీత్‌గౌడ్, హనుమంతు, శిరీష, మహిళలు, యువకులు పాల్గొన్నారు.